# ఈ గండం గడిస్తే చాలు

-కొంపెల్ల కామేశ్వరరావు

"ఆ సంఘటన గుర్తొస్తే ఇప్పటికీ ఒళ్ళు గగుర్పొడుస్తుంది" అంది లలిత ఏ ఉపోద్ఘాతమూ లేకుండా.

"నాకెలాంటి సంబంధమూ లేనేలేదు. అలాగని నా ప్రమేయం లేకపోనూ లేదు" అంది.

తలచుకుంటోంది, నిట్టూరుస్తోంది, లోలోపల మథనపడుతోంది, చెబితే ఏ ఉపద్రవం ముంచుకొస్తుందోనన్న శంక, చెప్పకపోతే గుండె బరువు కొంతైనా తీరేదెలా అన్న ఆవేదన. ఈ స్పందనలన్నీ ఆమె ముఖకవళికల్లోనే ప్రతిఫలిస్తున్నాయి. కాసేపు మౌనం రాజ్యమేలింది.

"నువ్వు చెప్పాలనుకుంటే చెప్పెయ్" అన్నాను.

ఏం నిర్ణయించుకుందో ఏమో తలపంకించి సంఘటన గురించి చెప్పడానికే సిద్ధపడింది.

"సాటి ఆడదే నా బ్రతుకులో నిప్పులు పోయాలని తలపెట్టింది" అంది.

"అసలేం జరిగిందో చెప్పమ్మా. ఇందాకట్నుంచి సందేహాలతో, శంకలతో సతమతమవుతున్నావు" అన్నాను.

"ఆరోజు...ఆరోజు...అమ్మా నాన్న ఏదో పని మీద మా సొంతూరు వెళ్ళాల్సి వచ్చింది. బావ జంషెడ్‌పూర్ స్టీల్ ప్లాంటులో ఉద్యోగం, కాబట్టి అక్క కుటుంబం అక్కడ. తమ్ముడు స్టేట్స్‌లో చదువు. చిన్నప్పట్నుంచీ కాస్త ధైర్యసాహసాలెక్కువే. ప్రతీ చిన్న విషయానికీ బెంబేలు పడిపోవడం, కుదేలైపోవడం నా తత్వంకాదు. డిగ్రీ చదువుతుండగా నలుగురైదుగురు అబ్బాయిలు ప్రేమిస్తున్నామంటూ వెంటబడితే చివాట్లు పెట్టి బ్రతుకు విలువ అర్థమయ్యేటట్టు వివరించి, ప్రేమైనా, మరేదైనా జీవితంలో స్థిరపడ్డాకేనంటూ నచ్చచెప్పేదాన్ని. ఇంట్లో నాకు అవసరమైనంత స్వేచ్ఛ ఇచ్చారు. అలాగని నేను దాన్ని వృథా చెయ్యలేదు. ఎప్పుడూ నిగ్రహాన్నీ, నిబ్బరాన్నీ కోల్పోలేదు. కానీ ఆ రోజు...మా పక్కింటమ్మాయి వాణి హడావిడిగా మా ఇంటికి వచ్చి 'అక్కా ఈరోజు నీకు సాయంగా పడుకోనా?' అడిగింది.

"అక్కర్లేదులే! ఫర్వాలేదు, ధైర్యంగా ఉండగలను!" అన్నాను.

ఆమె చొరవ, చనువు ఇష్టం లేకపోయినా, మరీ మొండిగా తిరస్కరించలేకపోయాను. పైగా పక్కింటివాళ్ళ అమ్మాయి కాబట్టి మరీ అంత కటువుగా చెబితే బాధపడుతుందని నీ ఇష్టం అనేశాను. రాత్రి భోజనం చేసి వచ్చింది. అనుకున్నట్టుగానే చాలాసేపు కబుర్లు చెప్పుకుని పడుకున్నాం. రాత్రి ఎంతసేపు మెలకువగా ఉన్నా ఉదయం ఐదున్నరకే లేవడం నా అలవాటు. ఆ ప్రకారమే సరైన సమయానికే మెలకువ వచ్చింది.

వాణీ వైపు చూశాను. ఆలస్యంగా లేస్తుందేమో, అదీకాక రాత్రి చాలా పొద్దుపోయింది కదా అనుకుంటూ లోపలికి వెళ్ళాను. ఆరుగంటలకీ, ఏడుగంటలకీ, ఏడున్నర, ఎనిమిది గంటలకి చూశాను. లేవలేదు.

ఎనిమిదిన్నర వరకు చూసి ఇక లాభంలేదని దగ్గరకు వెళ్ళి తట్టాను. కదలిక లేదు. గట్టిగా కుదిపాను. ఊహుఁ కదల్లేదు.

అనుమానం వచ్చింది.

చేతుల్ని చూశాను. పిడికిలి బిగించి ఉంది. బలవంతంగా వేళ్ళు సాగదీశాను. చేతిలో నిద్ర మాత్రలున్నాయి. ఆత్మహత్యాయత్నం.

అంతే, ఒక్కసారిగా నా కాళ్ళకింద భూమిని ఎవరో తవ్వేస్తూ పాతాళంలోకి తోసేస్తున్న భావన. ఇదేంటీ, ఈ అమ్మాయి ఇలా చేసింది, ఇప్పుడేం చెయ్యాలి అనుకుంటూనే మరో ప్రయత్నం చేద్దామనుకుని చెంప ఛెళ్ళుమనిపించాను. శక్తినంతా కూడగట్టుకుని లేపి కూర్చోబెట్టి చేతుల్లోంచి జారిపోకుండా గట్టిగా పట్టుకుని గుండెలపై పిడిగుద్దులు గుద్దుతూ లేపాను. కళ్ళు తేలేస్తోంది.

ఏదీ గమనించే స్థితిలో లేదు. అలా చెయ్యకుండా ముఖాన్ని అటూ ఇటూ కదుపుతూనే వాళ్ళమ్మగార్ని పిలిచాను.

ఆవిడ పరుగు పరుగున వచ్చి ఏడుస్తూనే గట్టిగా పట్టుకుని కూర్చున్నారు.

నాకు తెలిసిన కొన్ని జాగ్రత్తలు ఆవిడకు చెప్పి చుట్టుపక్కల ఇళ్ల దగ్గర ఎవరైనా ఉన్నారేమో చూశాను. అదృష్టవశాత్తూ తెలిసిన ఓ వ్యక్తి మోటారు సైకిలును స్టార్ట్ చేస్తూ కనిపించాడు. అతనికి చూచాయగా విషయం చెప్పి వెంటనే ఆటోని పిలవమన్నాను. ఆటో రాగానే వాళ్ళమ్మగారితో సహా ఆసుపత్రికి వెళ్ళాను. అందులో కూర్చున్నానేగానీ మనఃస్థిమితం లేదు. ఇప్పుడేం చెయ్యాలి? అన్నట్టు, ఆటోని పిలిచిన వ్యక్తికి విషయం చెప్పేశాను.

ఒకేళ అతను పోలీసులకు రిపోర్టిస్తే, రేపిదంతా పత్రికల్లో వస్తే, ఆమె ఆత్మహత్యాత్నాన్ని హత్యగా చిత్రీకరిస్తే తన బ్రతుకు చట్టుబండలవదూ? అమ్మా, నాన్న ఏమైపోవాలి? పిల్లల పెంపకం పట్ల, క్రమశిక్షణపట్ల వారికి ఉన్న నమ్మకం ఏమైపోవాలి?

ఇదంతా ఆలోచించకుండా అతనికి విషయం చెప్పేశానేమిటి? కానీ నా ప్రమేయమే దీలేదే, అలాగని చెబితే నమ్మేవాళ్ళెవరు? ఛ...ఛ ఇలాంటి పరిస్థితి వస్తుందనుకుంటే అమ్మ, నాన్నలతో కలిసి వెళ్ళిపోదునే.

ఓ పద్ధతిలో లేని ఆలోచనల కీకారణ్యంలో కొట్టుమిట్టాడుతున్నాను. ఒకపక్క ఆవిడ మాటలు శూలాల్లా పొడుస్తున్నాయి.





ఎందుకు చేసిందో వాణీకి స్పృహ వస్తేనే తెలుస్తుంది. కానీ ఎవర్నో ఉద్దేశిస్తూ పరోక్షంగా నేనే నేరస్తురాలిన న్నట్టు మాట్లాడుతోంది.

'భగవంతుడా! ఏమిటీ నాకీ పరీక్ష?' అనుకున్నాను అప్రయత్నంగా. ఓ గంట గడిచింది. ఓ గండం గడిచింది. ప్రాణానికి ప్రమాదం తప్పింది. ఆసుపత్రి డాక్టర్ ఫ్యామిలీ ఫ్రెండ్. ఆయన్ని కలిసినప్పుడు ఏం జరిగిందని ప్రశ్నించారు. రాత్రి నుంచి జరిగిన సంఘటనలు వివరించాను. ఆశ్చర్యపోయారాయన.

"ఆమెకి పెళ్లై ్ందా?" అడిగారు.

"ఇంకా అవ్వలేదు. సంబంధం కుదిరింది" అన్నాను.

తల పంకించి "అదే కారణమై ఉండొచ్చు" అన్నారు.

"అంటే?"

"ఆమెకి త్వరగా పెళ్ళి చెయ్యాలి" అన్నారు.

"ఆమె తల్లిదండ్రులెవరైనా ఇక్కడికి వచ్చారా? నా దగ్గరికి రమ్మను" అన్నారు.

"ఆంటీ! డాక్టరుగారు రమ్మంటున్నారు!" అని పిలుస్తూ లోపలికి తీసుకెళ్ళాను. కుర్చీలో కూర్చోమంటూ అసలేం జరిగిందో అడిగారు.

"వివరాలు నాకేం చెప్పలేదండి. లలితకి తోడుగా రాత్రి వాళ్ళ ఇంటికి వెళ్తున్నానంది. అక్కడేం జరిగిందో తెలీదు" అంటూ నావైపు అనుమానంగా చూశారు.

"ఇంతకీ ఎలా ఉంది సార్?" అడిగారు.

"లలిత వైపెందుకు చూస్తారు? ఆత్మహత్యాయత్నం నేరం. పైగా వాళ్ళింట్లో. సమయస్ఫూర్తితో ఎంతో ధైర్యంగా వ్యవహరించి ఇక్కడికి తీసుకువచ్చిందీ అమ్మాయి. ఒక్క అరగంట ఆలస్యమైతే మీ అమ్మాయి మీకు దక్కేది కాదు. త్వరగా పెళ్ళి చెయ్యండి. సంబంధాలు చూస్తున్నారా?" అడిగారు.

"కుదిరింది. త్వరలో ముహూర్తం పెట్టుకుంటున్నామండి" అన్నారు.

"ప్రేమ వ్యవహారంలాంటిదేదైనా...?"

మౌనం వహించిందామె.

"మీరు మాట్లాడకపోతే ఎలా? తల్లిగా ఆమె మనసులో ఏముందో తెలుసుకున్నారా?"

"......."

"అదే ఈ స్థితికి తెచ్చింది. బహూశా ఆమె ఎవర్నో ఇష్టపడుతోంది. మీరు వేరే పెళ్ళి చెయ్యడంవల్ల సంసారం చిక్కుల్లో పడుతుంది" అన్నారు.

మళ్ళీ మౌనం. "ఏం మాట్లాడరు?"

"మీరు చెయ్యబోయే పెళ్లికి ఆమె సిద్ధపడుతుందా? ఒకవేళ చేసుకున్నా ఆ తరువాత రాజీ పడుతుందా? మళ్ళీ ఆ ప్రయత్నం చెయ్యదా? పాపం అనవసరంగా ఆ కుటుంబం వీధిన పడుతుంది. నేనన్నది మీకు అర్థమవుతోందా?" అంటూ ప్రశ్నలు గుప్పించారు డాక్టరుగారు.

దేనికీ సమాధానం ఇవ్వలేదామె.

"ఈ అమ్మాయి కుటుంబానికీ, మాకు ఎప్పట్నుంచో స్నేహం. అందుకే చికిత్సకి ఒప్పుకున్నాను కానీ, లేకపోతే ఇటువంటి కేసును ఎవ్వరూ తీసుకోరు" అన్నారాయన మళ్లీ.

ఆమె ఈ ప్రశ్నలన్నింటినీ విని తట్టుకోలేకపోయారు.

"నన్నేమీ అడగొద్దు. దయచేసి ఏం జరిగిందో చెప్పండి" అన్నారాంటీ.

"ఒక్క అరగంటలో స్పృహ వస్తుంది. ఆమెనే అడగండి" అన్నారు.

అన్నట్టుగానే అరగంటలో మెలకువ వచ్చింది.

అప్పటిదాకా ఆత్రంగా చూస్తున్న లలిత ఊపిరి పీల్చుకుంది.

"ఏమైందమ్మా వాణీ?" అడిగారు.

కాసేపు బేల చూపులు చూసింది.

"నేను...నాకు...రెండు నెలల్నుంచి పీరియడ్స్ రావడంలేదు"

"మరి నాతో చెప్పలేదేం?" అడిగారు.

"ధైర్యం సరిపోలేదు. రెండు రోజులక్రితం లేడీ డాక్టర్ దగ్గరకు వెళ్ళాను. గర్భవతినన్నారు. అదేరోజు సాయంత్రం అతనికి ఫోన్ చేశాను. ఊళ్లో లేనన్నాడు. రాత్రి మళ్ళీ ఫోన్ చేశాను. సమాధానం లేదు. ఈ విషయాలన్నీ లలితకి చెప్పాలనుకున్నాను. చెప్పలేకపోయాను. ఏం చెయ్యాలో తోచలేదు. తెల్లవారుఝామున నాలుగ్గంటలకి నిద్రమాత్రలు మింగేశాను" అంది ఏడుస్తూ.

"మరి నీకు ఈ మాత్రలెక్కడ్నుంచి వచ్చాయి?" అడిగారు డాక్టర్.

"......."

"నా బ్రతుకులో చిచ్చు పెట్టాలనుకున్నావు కదూ? అదృష్టవశాత్తూ బ్రతికి బైటపడ్డావు కనుక సరిపోయింది. లేకపోతే నేను, మా అమ్మ, నాన్న ఏమయ్యుండేవాళ్ళం? నాకిష్టం లేకపోయినా ఇంటికి వచ్చి ద్రోహం తలపెట్టావ్. మీ అమ్మగారు నన్నో హంతకురాల్లా చూస్తున్నారు. నీకేం ద్రోహం చేశానని ఇంత అఘాయిత్యానికి ఒడిగట్టావ్?" అన్నాను ఈసడింపుగా.

"నేనంత దూరం ఆలోచించలేదు" అంది వాణి.

"ఇంతకీ అతనెవరే? ఈ ఊరేనా? మనవాళ్ళేనా?"

"ఈ ఊరేనమ్మా! ప్రస్తుతం ఊళ్ళో లేనన్నాడు" అంది రెండో ప్రశ్నకి జవాబివ్వలేదు.

"డాక్టర్! అబార్షన్ చేసెయ్యండి సార్, అదయ్యాక పెళ్ళి చేసేస్తాం!" అన్నారు ఆంటీ.


* * *

రెండ్రోజుల తర్వాత వాణీ ఇంటి బైట నిలబడి అమ్మా అంటూ అరిచిన అరుపుకి ఉలిక్కిపడి వాళ్ళమ్మగారూ, నేనూ బైటకు వచ్చాం. కొంచెం దూరంలో మోటార్ సైకిల్‌పై ఓ వ్యక్తి వెళ్తూ కనిపించాడు.

"అదిగో..అతనేనమ్మా" అంది.

నిజంగా నాకు పెద్ద షాక్.....!

"ఆరోజు నేను ఆటోని పిలవమని చెప్పింది అతనికే" అంది లలిత. ★



## లక్కీ ప్రియమణి

దాదాపు దక్షిణాది భాషలు నాలుగింటిలోనూ నటిస్తున్న ప్రియమణికి తాజాగా మంచి సినిమా ఛాన్స్ వచ్చింది. తెలుగులో హిట్టయిన 'రెడీ' సినిమా కన్నడ వెర్షన్‌లో హీరోయిన్‌గా నటించబోతోంది. 'రెడీ'లో జెనీలియా పాత్ర ఎంత ప్రాధాన్యత గలదో అందరికీ తెలుసు. కన్నడ 'రెడీ'లో హీరోగా పునీత్ రాజ్‌కుమార్ అయితే హీరోయిన్‌గా ప్రియమణి. ఈ సినిమాతో కన్నడంలో ప్రియమణి క్రేజ్ మరింత పెరిగే అవకాశాలున్నాయని అంచనాలు సినీ జనాలు వేస్తున్నారు.

